సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 27 । జూన్ । 2025



పడిపోతున్న సాగు

నవాబుపేట మండలంలో చిరు ధాన్యాల సాగు విస్తీర్ణం ఏటా తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

8లో▸



హోటళ్లలో తనిఖీలు

తాండూరు పట్టణంలోని పలు హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

8లో▸



బతుకు భారం!

వర్షాలు కురవక.. వ్యవసాయ పనులు ప్రారంభం కాకా కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

9లో▸

ఆపరేషన్ ముస్కాన్

వందల్లో బాలకార్మికులు.. పదుల్లో విముక్తి

- సత్ఫలితాలివ్వని ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ కార్యక్రమాలు
- 14వ విడతకు కసరత్తు
- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- జిల్లాలో 1,200 మందికిపైగా బాలకార్మికులు
- గత ఏడాది 65 మందికే విముక్తి
- మళ్లీ పనులకు వెళ్తున్న చిన్నారులు



పరిగి పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

వికారాబాద్: బాల్యం పిల్లల హక్కు.. చిన్నారులు ఉండాల్సింది పాఠశాలల్లోనే.. వారితో పనులు చేయిస్తే వారి ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. చిన్నారుల రక్షణ కోసం అనేక చట్టాలు వచ్చాయి. అందులో ఒకటి విద్యాహక్కు చట్టం. ఈ చట్టం అమల్లోకి వచ్చినా పిల్లలు పనులకు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది. చిన్నారులను పాఠశాలలో ఉంచడం కోసం నియమించిన ఆయా శాఖల అధికారులు తూతూ మంత్రపు కార్యక్రమాలతో మమా అనిపిస్తున్నారు. దీంతో బాల కార్మికులు రోజురోజుకూ పెరుగుతున్నారే తప్ప.. తగ్గడంలేదు. ఆరు నెలలకోసారి చేపట్టే ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ లాంటి కార్యక్రమాలు సైతం సత్ఫలితాల నివ్వడంలేదు. ఇప్పటి వరకు జిల్లాలో 13 సార్లు ఈ కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు 14వ విడతకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వచ్చే వారంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏడాదికి రెండుసార్లు

ఆయా పనుల్లో మగ్గుతున్న బాలకార్మికులకు విముక్తి కల్పించి వారిని బడులకు పంపాలనే లక్ష్యంతో అధికారులు ఆపరేషన్ ముస్కాన్.. ఆపరేషన్ స్మైల్ పేరుతో కార్యక్రమాలు రూపొందించారు. ఇందులో భాగంగా పోలీస్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, విద్య, ఆరోగ్య శాఖ, చైల్డ్ లైన్ సభ్యులతో బృందాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి ఆరు నెలలకోసారి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతోంది. ఈ కార్యక్రమాలు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిరంతర ప్రక్రియగా సాగుతున్నాయి. మన జిల్లాలో మాత్రం ఏడాదికి రెండు సార్లు కార్యక్రమం నిర్వహించి మమా అనిపిస్తున్నారు.

పనులు మాన్పించినా..

ఆపరేషన్ ముస్కాన్.. స్మైల్ కార్యక్రమాల ద్వారా బాల కార్మికులకు పనుల నుంచి విముక్తి కల్పిస్తున్న అధికారులు వారు పాఠశాలలకు వెళ్తున్నారా? తిరిగి పనులకు వెళ్తున్నారా అనే విషయం పరిశీలించడం లేదు. పిల్లలను పనుల్లో పెట్టుకుంటున్న వారిపై కేసులు నమోదు చేసి చిన్నారులను హోంకు తరలిస్తున్నారు. ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. హోంకు చేరిన పిల్లల వయస్సు ఆధారంగా ఆయా తరగతుల్లో చేర్పాలి. అలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కొద్ది రోజుల తర్వాత చిన్నారులు బయటికి వచ్చి తిరిగి పనులకు వెళ్తున్నారు.

పరిహారం ఊసేలేదు

బాల కార్మికులను పనులు మాన్పించి బడులకు పంపే బాధ్యత విద్యాశాఖ, కార్మిక శాఖ పైనే ఉంటుంది. ఎవరైనా పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కేసులు నమోదు చేయడం తోపాటు యజమానుల నుంచి పరిహారం ఇప్పించాలి. ఇప్పటి వరకు వందల సంఖ్యలో బాల కార్మికులను విముక్తి కల్పించినా ఒక్కరికి కూడా పరిహారం ఇప్పించిన పాపాన పోలేదు. పై రెండు శాఖల అధికారులు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో పాల్గొనడంలేదు. పోలీసు, చైల్డ్ లైన్ ప్రతినిధులు మాత్రమే రిస్కు తీసుకుంటున్నారు. గత ఏడాది పోలీసులు దాదాపు 65 కేసులు నమోదు చేశారు. జిల్లాలో 1,200 మందికి పైగా బాల కార్మికులు ఉన్నట్లు స్వచ్ఛంద సంస్థల గణాంకాలు చెబుతున్నా విద్యాశాఖ వద్ద మాత్రం సరైన లెక్కలు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ఏడాది ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 65 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు అధికారులు తెలిపారు.

హోంలలో సౌకర్యాల కరువు

బాల కార్మికులకు పునరావాసం కల్పించేందుకు జిల్లాలో నాలుగు హోంలు (శిశుగృహ, బాలసదనం, యజ్ఞ ఫౌండేషన్, హెల్ప్ ఆల్ సొసైటీ) ఉన్నాయి. వీటిలో సౌకర్యాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. పనుల నుంచి విముక్తి కల్పించిన బాలలను బడుల్లో చేర్పించే వరకు హోంలోనే ఉంచాల్సి ఉంటుంది. వారి సంరక్షణ కోసం కేర్ టేకర్లు, వార్డెన్లు, కౌన్సెలింగ్ చేసేందుకు ప్రత్యేక నిపుణులు, బ్రిడ్జి కోర్స్ ఇచ్చేందుకు వలంటీర్లు ఉండాలి. కానీ నాలుగు హోంలలో ఒకరు చొప్పున కేర్ టేకర్లు ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు బాల కార్మికులు పాఠశాలలకు వెళ్లేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఇతర అధికారులు

డ్రగ్స్‌తో భవిష్యత్ నాశనం

- మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం
- బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం
- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- వికారాబాద్‌లో భారీ ర్యాలీ

అనంతగిరి: యువత చెడు మార్గాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా యువజన క్రీడలు, శిశు సంక్షేమం, పోలీసు శాఖల ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి బీజేఆర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత చెడు అలవాట్ల వైపు ఆకర్షితులైతే వచ్చే కష్ట నష్టాలను తల్లిదండ్రులు వివరించాలన్నారు. కుటుంబం ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటుందో తెలియజేయాలని సూచించారు. నేటి యువతే రేపటి భావి భారత పౌరులన్నారు. కొంతమంది డ్రగ్స్‌కు బానిసలై భవిష్యత్‌ను చేజేతులారా నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువత డ్రగ్స్, గుట్కా, గంజాయి, సిగరెట్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. భారత దేశానికి యువత పట్టుకొమ్మ లాంటి వారని, వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం, దేశం బాగుపడుతుందని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం, క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. మనం చెడు అలవాట్లకు బానిసలైతే తల్లిదండ్రులు పడే క్షోభ వర్ణనాతీతమని, ఇది గుర్తుంచుకొని మెలగాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి మహమ్మద్ సత్తార్, శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, జిల్లా అధికారులు, పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా రాజు

పరిగి: తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా ఆర్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని కర్మన్‌ఘట్‌లో గల కార్యాలయంలో రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి వహాజ్‌అలీ చేతుల మీదుగా గురువారం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తైక్వాండో క్రీడను మరింత విస్తృతం చేస్తామన్నారు.

న్యూస్‌రీల్

రహదారులతోనే ప్రాంతాల అభివృద్ధి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: రహదారులతోనే ప్రాంతాల అభివృద్ధి చెందుతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బాపల్లి నుంచి దోమ మండలం బడెంపల్లి వరకు డబుల్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఇందుకోసం రూ.2.24 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, నాయకులు వెంకట్రాములు గౌడ్, జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, మల్లేశం, అంజిల్‌రెడ్డి, మల్లికార్జున్, మోత్యానాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలు, అడ్మిషన్లలో తాండూరు కళాశాల భేష్

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా
- నోడల్ ఆఫీసర్ శంకర్‌నాయక్‌కు సన్మానం



శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా

తాండూరు టౌన్: ఇంటర్ ఫలితాల్లో, అడ్మిషన్లలో తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అద్భుతంగా ఉందని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా కితాబు ఇచ్చారు. గురువారం నగరంలో ఆమె రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూరు జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 550 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవడం, గత సంవత్సరం ఫలితాల్లో 83శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్‌ను ఆమె ఘనంగా సన్మానించారు. ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకోవడం పట్ల కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మల్లినాథప్ప, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రేణుకాదేవి తదితరులు

అనంతగిరి: నేషనల్ గ్రీన్ కాప్స్ ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ స్టూడెంట్ పర్యావరణ్ కాంపిటీషన్ – 2025 పోటీలను విజయవంతం చేయాలని డీఈఓ రేణుకాదేవి కోరారు. గురువారం వికారాబాద్‌లో ఇందుకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్, ఏపీఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

పరిగి: ప్రభుత్వ భూములను అక్రమ రిజిస్ట్రేషన్ చేస్తున్న పరిగి తహసీల్దార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం పరిగి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగంపల్లి గ్రామంలో ఎకరా ప్రభుత్వ భూమిని ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అలాగే గోవిందాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 52లో 16 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేశారన్నారు. తహసీల్దార్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.



చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, అధికారుల బృందం

బొంరాస్‌పేట చెరువుకు మహర్దశ

- రూ.10 కోట్లతో ఎకో టూరిజం ఏర్పాటు
- క్షేత్రస్థాయి పరిశీలన చేసిన డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్

బొంరాస్‌పేట: మండల పరిధిలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న బొంరాస్‌పేట చెరువు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో త్వరలో రూ.10 కోట్లతో ఎకో టూరిజం ఏర్పాటు కాబోతోంది. గురువారం జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. చెరువులో బోటింగ్ ఏర్పాటు చేసి మరో ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దనున్నారు. చెరువుకు పక్కనే ఉన్న సంగమేశ్వర ఆలయ పరిసరాలు, అటవీశాఖ పరిధిలోని స్థలాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. పార్క్‌తోపాటు, చిన్నారుల కోసం ఆట వస్తువులు అందుబాటులో ఉంచనున్నారు. బొంరాస్‌పేట చెరువు జాతీయ రహదారికి పక్కనే ఉండటంతో ప్రయాణికులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.

రెండు రోజుల్లో నివేదికలు

అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న టూరిజం పార్కుకు సంబంధించిన వివరాలను డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్ వివరించారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రయాణికులు సేదతీరడానికి బొంరాస్‌పేట చెరువు పరిసరాలు ఎంతో అనువుగా ఉంటాయన్నారు. గతంలో స్థల సమస్య కారణంగా పార్కులను అభివృద్ధి చేయలేకపోయామని, ప్రస్తుతం అడ్డంకులు తొలగిపోయినట్లు తెలిపారు. ఎకో టూరిజం పార్కు, చెరువులో బోటింగ్ కోసం అనుమతులు వచ్చాయన్నారు. ఇందు కోసం రూ.10 కోట్లు మంజూరు కానున్నట్లు వివరించారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. డీఎఫ్ఓ వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ డీఈ కిరణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, నాయకులు జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, మల్లేశం, అంజిల్‌రెడ్డి, భీమయ్యగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

త్వరలో మెడికల్ కళాశాల తరగతులు

- తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్
- తాండూరు పట్టణంలో భవనం పరిశీలన



తాండూరు పట్టణంలో మెడికల్ కళాశాల కోసం భవనాన్ని పరిశీలిస్తున్న అజయ్ కుమార్

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలో త్వరలో మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలో రూ.26 కోట్లతో చేపట్టిన(నిర్మాణ దశలో ఉన్న) భవనాన్ని ఆయన పరిశీలించారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సర తరగతుల కోసం కావాల్సిన మౌలిక సదుపాయాలు, వసతులు, గదులు, ల్యాబ్‌లు, హాస్టల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. భవనం ఎప్పటిలోగా అందుబాటులోకి వస్తుందని ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఏర్పాటైన మెడికల్ కళాశాలల కోసం నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. పూర్తి వివరాలను ఈనెల 30న ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు చెప్పారు. తాండూరు, కొడంగల్‌లో భవన నిర్మాణ పనులు ఏమేరకు పూర్తయ్యాయనే విషయమై పరిశీలనకు వచ్చామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి తాండూరులో మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. మరో మూడు నెలల్లో భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. 56 మంది విద్యార్థులకు సరిపడా హాస్టల్ భవన నిర్మాణ పనులను పరిశీలించామన్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలు విస్తత పరచనున్నట్లు వివరించారు. సిటి స్కాన్ నుంచి ఎంఆర్ఐ వరకు అధునాతన టెక్నాలజీ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.

కొడంగల్ కళాశాల తాండూరులో..

సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాల తరగతులను తాండూరులో ఎందుకు కొనసాగించనున్నారని విలేకరులు కమిషనర్‌ను ప్రశ్నించగా, దీనికి ఆయన ఇలా సమాధానమిచ్చారు. మెడికల్ కళాశాల కొడంగల్‌కు మంజూరైన విషయం తెలిసిందేనని, అయితే తాండూరులో నర్సింగ్ కళాశాల కోసం నిర్మిస్తున్న భవనాన్ని మెడికల్ కళాశాల కోసం ఉపయోగించుకోవాలని ప్రభుత్వం సూచించినట్లు చెప్పారు. నర్సింగ్ విద్యార్థినుల కోసం అవసరమైతే మరో చోట భవన నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అనంతరం కమిషనర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని పరిశీలించారు. ఆయన వెంట టీజీఎంఐడీసీ ఎస్ఈ సురేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనందం, ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్లు డాక్టర్ సునీత, డాక్టర్ వినయ్‌కుమార్ ఉన్నారు.

పనుల్లో వేగం పెంచండి

కొడంగల్: కొడంగల్ పట్టణంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ఆదేశించారు. గురువారం కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, నాణ్యతలో రాజీ పడరాదని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రప్రియ, డాక్టర్లు సాకేత్, శివశంకర్, పూజ, శ్రావణి, వైద సిబ్బంది మోహన్, గీత, సంగీత తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

తుర్కయంజాల్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇంజాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 383లో హెచ్ఎండీఏ వెంచర్ ఏర్పాటు కోసం భూమి ఇచ్చిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. వెంచర్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న భూమిని కోల్పోయినందుకుగాను 100 మంది రైతులకు 300 గజాల చొప్పున ప్లాట్ కేటాయిస్తున్నట్లు అప్పటి ఆర్డీఓ, తహసీల్దార్ పత్రాలు అందజేశారని తెలిపారు. అప్పట్లో ముగ్గురికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారని, మిగతా వారిని అలానే వదిలేశారన్నారు. నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ రిజిస్ట్రేషన్ చేయకుండా కాలాయపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఆర్డీఓ, తహసీల్దార్‌ను కలవగా ఫైల్ తమ వద్ద లేదని, తాము ఏమీ చేయలేమని చెబుతున్నారని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి



బంట్వారంలోని ఓ దుకాణంలో పురుగు మందు డబ్బాను పరిశీలిస్తున్న డీఏఓ మోహన్‌రెడ్డి

బంట్వారం: కల్తీ విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. పురుగు మందులు, విత్తనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డీలర్లు స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. పురుగు మందులు, విత్తనాలు, ఎరువు కొనుగోలు చేసే రైతులు విధిగా రసీదులు తీసుకోవాలన్నారు. అనంతరం మద్వాపూర్ గ్రామాన్ని సందర్శించి రైతు రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. వర్షాకాలం పంటల సాగుకు సంబంధించి వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రావ్య, ఏఈఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

కన్నబిడ్డల్లా చూసుకోవాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ హర్షిత్ చౌదరి

ట్రెయినీ కలెక్టర్ హర్షిత్ చౌదరి

తాండూరు రూరల్: తల్లిదండ్రులను వదలి హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులను ఉపాధ్యాయులు కన్నబిడ్డల్లా చూసుకోవాలని ట్రెయినీ కలెక్టర్ హర్షిత్ చౌదరి అన్నారు. గురువారం మండలంలోని ఐనెల్లి శివారులో గల కేజీబీవీని తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వంట గదిని పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. భోజన విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, స్పెషల్ ఆఫీసర్ ఆశలత, ఆర్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాణ్యమైన భోజనం వడ్డించాలి

జిల్లా వెనుకబడిన సంక్షేమశాఖ అధికారి ఉపేందర్

దౌల్తాబాద్: హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని జిల్లా వెనుకబడిన సంక్షేమశాఖ అధికారి ఉపేందర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థుల వివరాలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రతీరోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య పెంచాలని వార్డెన్ రాధను ఆదేశించారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం అన్ని రకాల వసతులు కల్పిస్తుందన్నారు.

మైనార్టీ ఉద్యోగులపై వివక్ష సరికాదు

పరిగి: మైనార్టీ ఉద్యోగులపై వివక్ష సరికాదని మైనార్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సర్దార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వరుసగా మైనార్టీ ఉద్యోగులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీ ఉద్యోగులపై వివక్షను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బొంరాస్‌పేట ఎస్ఐ, యాలాల మండల కేంద్రంలో ఉపాధ్యాయురాలిపై కావాలనే వివక్ష చూపించారని పేర్కొన్నారు. విద్యార్థులకు అర్థవంతంగా పాఠం బోధించాలనే క్రమంలో పొట్టేలు మెదడు తీసుకువచ్చి పాఠం చెప్పారని వివరించారు. ఈ విషయంలో ఉన్నత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాద బాధితురాలి పరిస్థితి విషమం

మొయినాబాద్: రోడ్డు ప్రమాదంలో బుధవారం తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు లక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. బుధవారం మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లి సమీపంలో అతివేగంతో వెళ్తున్న కారు ఎదురుగా వచ్చిన స్కూటీని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందగా ఓ మహిళ గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదానికి ప్రధాన కారణం అతివేగమేనని గుర్తించిన పోలీసులు, కారు నడిపిన వ్యక్తిని పిలిచి విచారించారు. ఎగుడు దిగుడుగా ఉన్న రోడ్డులో కారు బ్రేక్ తొక్కబోయి యాక్సిలరేటర్ తొక్కడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

ఇల్లు అద్దెకు కావాలని వచ్చి..

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

షాద్‌నగర్: ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకొని ఉడాయించిన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ గ్రామంలోని అంజిరెడ్డి కాలనీకి చెందిన యాదమ్మ(58) గురువారం మధ్యాహ్నం ఇంటి ముందు కూర్చొంది. ఇల్లు అద్దెకు కావాలని వచ్చిన ఇద్దరు యువకులు, ఆమెను మాటల్లో దింపి మెడలోని నాలుగు తులాల పుస్తెల తాడును తెంచుకొని పరారయ్యారు. పల్సర్ బైక్‌పై వచ్చిన నిందితులలో వెనుక కూర్చొన్న వ్యక్తి హెల్మెట్ ధరించి ఉన్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

రోసువాస్ పేరుతో నకిలీ టాబ్లెట్లు

ఇద్దరిని అరెస్టు చేసిన డీసీఏ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: శరీరంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతో పాటు గుండె సంబంధిత సమస్యల కోసం వినియోగించే రోసువాస్ ఎఫ్ 10, రోసువాస్ ఎఫ్ 20 టాబ్లెట్స్ నకిలీవి విక్రయిస్తున్న ఇరువురిని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు అరెస్టు చేశారు. వీరిని న్యాయస్థానంలో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం గురువారం వెల్లడించారు. సన్ ఫార్మా తయారు చేసే ఈ రెండు టాబ్లెట్లకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఈ విషయం గుర్తించిన ఇందర్‌బాగ్‌లోని గంగ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ యజమాని కె.ప్రవీణ్ కుమార్, గుజరాతీ గల్లీలోని శ్రీ నంది ఫార్మా యజమాని ఎం.శ్రీనివాస్ నకిలీవి విక్రయిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న అధికారులు దాడులు చేసి ఇద్దరినీ పట్టుకున్నారు. వీరి నుంచి భారీ మొత్తంలో నకిలీ టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇవి వీరికి ఎక్కడి నుంచి వస్తున్నాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

మత్తుతో జీవితం చిత్తు!

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

- తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి
- డ్రగ్స్‌పై అవగాహన
- విద్యార్థుల ర్యాలీ, మానవహారం



బొంరాస్‌పేట: డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మోహన్‌చంద్ర, ఎంఈఓ హరిలాల్

తాండూరు టౌన్: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు చిత్తవుతాయని తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు కళాశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ డ్రగ్స్ వినియోగం, విక్రయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఇందిరాచౌక్‌లో ఏర్పాటు చేసిన వేదికపై డీఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలైన యువత నేరాలకు పాల్పడుతున్నారన్నారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సంతోశ్ కుమార్, ఐఎంఏ తాండూరు అధ్యక్షుడు డాక్టర్ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై..

బొంరాస్‌పేట: ప్రతిఒక్కరూ వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ మోహనచంద్ర, ఎంఈఓ హరిలాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతీ విద్యార్థి ఉన్నత ఆశయాలను ఎంచుకొని చదువుకోవాలన్నారు. ఉత్తమ విద్యార్థిగా రాణించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మత్తు అలవాటైతే విలువైన జీవితం చిత్తవుతుందని హెచ్చరించారు.

సెల్‌ఫోన్లకు దూరంగా..

ప్రతిఒక్కరూ సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటే మేలు జరుగుతుందన్నారు. ఏదైన సందేహాలు, మంచి విషయాలకు, విద్యాభ్యాసం వంటివి మెరుగుపరుచుకోవడానికి తప్ప మరే సందర్భంలోనూ వాడొద్దన్నారు. గేమ్‌లు, బెట్టింగులు, ఫోన్లకు వచ్చే లింకులకు ఎట్టి పరిస్థితుల్లోను ఓటీపీ వంటివి చెప్పొద్దన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దినేశ్, ఏఎస్ఐ ఆనంద్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

మోమిన్‌పేట: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని సీఐ వెంకట్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలను నివారించేందుకు అవగాహన కల్పించి, ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తుతో భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పరిగి: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి

కుల్కచర్ల: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, చౌడాపూర్ కేజీబీవీ ప్రత్యేకాధికారి జ్యోతి పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో డ్రగ్స్ నివారణకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మత్తుపదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మాదక ద్రవ్యాలను నిర్మూలించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని మండల విద్యాధికారి విజయరామారావు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



తాండూరు టౌన్: యాంటీ డ్రగ్ సోల్జర్ బాక్స్‌లో డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి

అలవాటు చేసుకోవద్దు

కొడంగల్: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ, డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి వినాయక చౌరస్తా నుంచి బసిరెడ్డి ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటు చేసుకోవదన్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల్ ఎస్ఐలు సత్యనారాయణ, రవి గౌడ్, యాదగిరి, కళాశాలల ప్రిన్సిపాల్‌లు, పాల్గొన్నారు.

బంట్వారం: మాదకద్రవ్యాలను నిర్మూలించాలని కోట్‌పల్లి, బంట్వారం ఎస్ఐలు శైలజ, విమల పేర్కొన్నారు. కోట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ విద్యార్థులతో చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి, అమ్మకం, కొనుగోలు చేసినట్లు తెలిస్తే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు

- ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో శుభ్రత పరిశీలన
- కుళ్లిన, నిల్వ చేసిన పదార్థాలు వాడొద్దని హెచ్చరిక
- ఓ హోటల్‌ను సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు

తాండూరు టౌన్: పట్టణంలోని పలు హోటళ్ల, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది గురువారం తనిఖీలు నిర్వహించారు. దర్బార్, అల్బూర్‌ఖాన్, న్యూ సన్మాన్, రాయల్ ఫుడ్, సోహైల్ హోటళ్లతో పాటు పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. కిచెన్, ఫ్రిడ్జ్ శుభ్రత నిర్వహణ, తాగునీరు, వంటలకు ఉపయోగిస్తున్న పదార్థాలను తనిఖీ చేశారు. పాడైపోయిన నూడుల్స్, నిల్వ చేసిన సాస్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుభ్రత పాటించని పాత కూరగాయల మార్కెట్‌లోని ఓ హోటల్‌ను సీజ్ చేశారు. ఈసందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ మాట్లాడుతూ.. వర్షాకాలం, వ్యాధుల సీజన్ కావడంతో పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. కుళ్లిన పదార్థాలను నిల్వ చేసి వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. పలు హోటళ్ల నుంచి నిల్వ ఉన్న పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ జవాన్లు పాల్గొన్నారు.



నిల్వ చేసిన సాస్‌లను స్వాధీనం చేసుకున్న మున్సిపల్ సిబ్బంది

లోన్ ఇప్పిస్తానని టోకరా

- రూ41,102 ప్రాసెసింగ్ ఫీజు కింద పోగొట్టుకున్న బాధితుడు
- పోలీసులకు ఫిర్యాదు

కుల్కచర్ల: లోన్ ఇస్తానని చెప్పి రూ.41,102వేలు టోకరా వేసిన ఘటన కుల్కచర్ల మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన ఎ. వెంకటేశ్ ఫేస్‌బుక్ బ్రౌజ్ చేస్తున్నక్రమంలో లోన్ ఆఫర్ కనిపించింది. వెంటనే ఆ లింక్‌ను ఓపెన్ చేసిన వెంకటేష్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి తను ఓ సంస్థకు ఫీల్డ్ ఆఫీసర్‌నంటూ ఫోన్‌లో మాట్లాడారు. మీకు రూ.1,50,000వేలు లోన్ మంజూరైందని అందుకుగాను ప్రాసెసింగ్ ఫీజుకింద కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుందని సూచించాడు. ఈ విషయాన్ని నమ్మిన వెంకటేశ్ విడతల వారీగా రూ.41,102ల వరకు అతడి ఖాతలో జమ చేశాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి మళ్లి తన ఖాతలో కొంత మొత్తాన్ని జమచేయాలని కోరడంతో అనుమానం వచ్చిన వెంకటేశ్ వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కుల్కచర్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారని ఎస్ఐ రమేశ్ తెలిపారు.

నిజం తేల్చకుండానే సస్పెన్షన్ ఏమిటి?

- ఏకపక్ష నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి
- విద్యాశాఖ అధికారులకు ప్రజాసంఘాల వినతి

యాలాల: నిజ నిర్ధారణ చేయకుండానే ఏకపక్షంగా టీచర్‌ను సస్పెండ్ చేయడం ఏమిటని ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం ఎంఈఓ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి, కేవీపీఎస్, సీఐటీయూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి, పీడీఎస్‌యూ, ఉద్యమకారుల ఐక్యవేదిక, పబ్లిక్ వాయిస్, పూలే అంబేడ్కర్ తదితర సంఘాల నాయకులు మాట్లాడుతూ.. పాఠ్య బోధనలో భాగంగా సైన్స్ టీచరు ఖాసీం బీ గొర్రె మెదడును పదర్శించారన్నారు. ఈ విషయంలో మరో జంతువు మెదడు తెచ్చారంటూ ఆందోళన చేయడం సరికాదని తెలిపారు. ఈ విషయంలో నిజనిర్ధారణ చేయకుండా ఓ మైనార్టీ టీచర్‌ను అన్యాయంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అబ్దుల్ వాహెబ్, ఉప్పలి మల్కయ్య, శ్రీనివాస్, చంద్రప్ప, గుమ్మడి రత్నం, సమియొద్దీన్, శ్రీనివాస్, వాజిద్, జిలానీ, రఘుపతి, అహ్మద్, అక్బర్‌బాబా, ముస్తఫా, రియాజ్ తదితరులు ఉన్నారు.



ఎంఈఓ రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వ్యసనాలకు దూరంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న ఎస్ఐ విఠల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీదేవి

తాండూరు రూరల్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్ అన్నారు. తాండూరు మండలం జినుగుర్తి గేటు వద్ద ఉన్న మోడల్ స్కూల్‌లో గురువారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వ్యసనాల వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. గంజాయి, డ్రగ్స్, మద్యపానం, పొగాకు వంటివి జీవితాలను నాశనం చేస్తున్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీదేవి, ఏఎస్ఐ పవన్‌కుమార్, కానిస్టేబుళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక



ఈశ్వరరావు

పూడూరు: కంకల్ పాఠశాల ఉపాధ్యాయుడు ఈశ్వరరావు జాతీయ స్థాయి శిక్షణకు ఎంకయ్యారని మండల విద్యాధికారి సాయిరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయి విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో సత్తాచాటారన్నారు. నూతన అభ్యసన ప్రక్రియలకు సంబంధించి అన్ని జిల్లాల నుంచి ప్రదర్శనలు రాగా ఉత్తమ ప్రదర్శన అందించిన ఉపాధ్యాయులను జాయతీ స్థాయికి ఎంపిక చేశారన్నాని స్పష్టంచేశారు. వీరు జూలై 3నుంచి 17వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించే శిక్షణలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా గురువారం కాంప్లెక్స్ హెచ్ఎం పుష్ప, లక్ష్మణ్, ఉపాధ్యాయులు ఈశ్వరరావును సన్మానించారు.

హకీంపేట్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు



విద్యార్థుల నుంచి అడ్మిషన్లను తీసుకుంటున్న సిబ్బంది

దుద్యాల్: మండలం ఏర్పాటయ్యి మూడు సంవత్సరాలు గడుస్తున్నా, ఇంటర్మీడియట్ కాలేజీ లేకపోవడంతో విద్యార్థులు ఇతర మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. 6 నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి హకీంపేట్‌కు ఇంటర్ కళాశాల మంజూరు చేశారు. దీంతో గ్రామంలోని గోశాల సమీపంలో తాత్కాలికంగా కళాశాల కోసం మూడు గదులు ఏర్పాటు చేశారు. ప్రస్తుత అకాడమీక్ సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభించారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులకు గాను సిబ్బంది అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు ఎంపీసీ-10, బైపీసీ-32, సీఈసీ-16, హెచ్ఈసీ-06, ఎంఎల్‌టీ-05, ఎంపీహెచ్‌డబ్ల్యూ-11 సీట్లను బర్తీ చేసినట్లు అధికారులు తెలిపారు.

‘ఇందిరమ్మ’లో ఇంటి దొంగలు!

నిరుపేదలకు అందని గూడు

- లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు
- ఎమ్మెల్యే హెచ్చరించినా మారని తీరు

బషీరాబాద్: గూడు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం ‘ఇందిరమ్మ’ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తుండగా.. కొంతమంది కింది స్థాయి నాయకులు అక్రమాలకు తెరలేపారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామానికి 26 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. నలుగురు అధికార పార్టీ నేతలు వీటిని పంచుకొని రూ.3 వేలు ఇచ్చిన వారి వివరాలతో జాబితా తయారు చేసి, అధికారుల ద్వారా మంజూరు చేయించారు. అయితే ఇందులో చాలా మంది అనర్హులు ఉన్నారని బాధితులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అర్హులకు మొండిచేయి

గ్రామంలో 46 మందితో కూడిన జాబితాను నలుగురు కాంగ్రెస్ నేతలు మండల అధికారులకు అందజేశారు. అధికారులు కూడా ఎలాంటి నిబంధనలు చూడకుండా జాబితాలోని 26 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇందులో నిరుపేదలు, అర్హులైన వారికి ఇళ్లు మంజూరు కాలేదు.

ఎమ్మెల్యే హెచ్చరించినా..

స్థానిక నాయకులంతా ఒక్కటై ఇందిరమ్మ లబ్ధిదారుల వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేసినట్లు వారం రోజుల క్రితమే తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. ఈ విషయమై ఆయన సదరు నాయకులను తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది. లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకుంటే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని గట్టిగా మందలించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సొంత పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



ఇందిరమ్మ నమూనా ఇల్లు

“రూ.10 వేలు తీసుకున్నాడు



ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని నా వద్ద ఓ కాంగ్రెస్ నాయకుడు రూ.10 వేలు తీసుకున్నాడు. తీరా ప్రొసిడింగ్ రాలేదని నిలదీయగా రెండో విడతలో ఇప్పిస్తానని చెబుతున్నాడు. ఇల్లు లేకపోవడంతో ఓ చిన్న గదిలో కిరాయికి ఉంటున్నాం. ఇళ్లు ఉన్నవారికే ప్రొసీడింగ్‌లు ఇచ్చారు. నావద్ద డబ్బులు తీసుకుని కూడా ఇవ్వలేదు. ఈ విషయం ఎవరికైనా చెబితే రేషన్ కార్డు కూడా కట్ చేస్తామని బెదిరిస్తున్నారు.

– తెలుకూరి మంజుల, ఎక్మాయి

పడిపోతున్న చిరు ధాన్యాల సాగు

- వాణిజ్య పంటల వైపు మొగ్గుచూపుతున్న అన్నదాతలు
- డిమాండ్ ఉన్నా నామమాత్రంగానే సాగు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు



దాతాపూర్‌లో సాగు చేసిన పచ్చ జొన్న పంట

నవాబుపేట: చిరు ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మంచివి. వీటిలో పోషక విలువలు మెండుగా ఉంటాయి. ఇలాంటి పంటల సాగు విస్తీర్ణం ఏటా తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు వీటిని రైతులు సంప్రదాయ పంటలుగా సాగు చేసేవారు. ఇటీవల కాలంలో వాణిజ్య పంటల సాగుపై అన్నదాతలు మక్కువ చూపుతున్నారు. చిరుధాన్యాలైన పెసలు, ఉలవలు, సజ్జలు, కొర్రలు, పచ్చజొన్నలు, మినుములు, అనుములు వంటి పప్పుదినుసుల సాగు పెద్దగా కనిపించడం లేదు. నూనె గింజల సాగు సైతం భారీగా తగ్గింది. నువ్వులు, తెల్లకుసుమ, గడ్డి నువ్వులు వంటి సాగు తగ్గుముఖం పట్టింది. వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలు మాత్రమే అక్కడక్కడ కనిపిస్తున్నాయి. సంప్రదాయ పంటల స్థానాన్ని నేడు వాణిజ్య పంటలైన పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, కంది, గోధుమ వంటివి ఆక్రమిస్తున్నాయి. నల్లరేగడి నేలల్లో పండించే కొర్రలు, సజ్జలు, మినుములు, అనుములు, మంచి నువ్వులు పూర్తిగా తగ్గాయి. పదేళ్ల క్రితం వరకు మండలంలో చిరుధాన్యాల పంటల సాగు దాదాపు 5వేల ఎకరాల్లో ఉండేది.. ప్రస్తుతం వంద ఎకరాలకు పడిపోయింది.

ఏటా తగ్గుముఖం

గతేడాది మండలంలో పత్తి పంట 21,539 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న 744 ఎకరాల్లో, కందులు 2,284 ఎకరాల్లో, కూరగాయల 2,177 ఎకరాల్లో, వరి 393 ఎకరాల్లో సాగు చేశారు. చిరుధాన్యాలైన పెసర కేవలం 18 ఎకరాల్లో, మినుములు 9 ఎకరాల్లో, ఉలవలు 3 ఎకరాలు, నూనె గింజలు(పొద్దుతిరుగుడు, తెల్ల కుసుమలు) 722 ఎకరాల్లో మాత్రమే సాగైంది. రాగులు, కొర్రలు, సజ్జలు, అవుశలు మచ్చుకైనా కనిపించలేదు. ఈ సారి సైతం చిరుధాన్యాల సాగు అంతంత మాత్రంగానే ఉండవచ్చని అధికారులు అంటున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

సంప్రదాయ పంటలైన చిరుధాన్యాలు, పలు రకాల నూనె గింజల సాగు రోజు రోజుకు కరుమరుగవుతోంది. వాటి సాగును ప్రోత్సహించేందు ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కూరగాయలు, పండ్ల తోటల సాగుకు రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలు చిరు ధాన్యాల సాగును విస్మరించడం సరికాదని పలువురు అంటున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుంటే చిరుధాన్యాల సాగు పెరిగే అవకాశం లేకపోలేదని పలువురు రైతులు పేర్కొన్నారు.

మంచి ధరలు

చిరుధాన్యాలకు మర్కెట్ మంచి ధరలు ఉన్నాయి. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునే వారు వీటిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో వీటికి డిమాండ్ బాగా పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో పెసర్ల ధర రూ.120 వరకు ఉంది. కిలో మినుములు రూ.100 పైనే, కిలో బెబ్బర్లు రూ.90, కిలో ఉలవలు రూ.100, పచ్చజొన్నలు రూ.40 వరకు పలుకుతున్నాయి.

“ఆసక్తి చూపని రైతులు



చిరుధాన్యాల సాగుపై రైతు లు ఆసక్తి చూపడం లేదు. వాణిజ్య పంటల వైపే మొ గ్గుచూపుతు న్నారు. చిరు ధాన్యాల సాగుకు పెట్టుబడి తక్కువ. దిగుబడికి మంచి డిమాండ్ ఉంటుంది. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నా శ్రద్ధ చూపడం లేదు.

– జ్యోతి, మండల వ్యవసాయాధికారి, నవాబుపేట